



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 21-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 199 పేజీలు: 4 వెల : రూ.7


# కత్తులతో బెదిరించి..

* సిక్కోలులో వ్యాపారి గోవింద్ ఇంట్లోకి చొరబడిన ముగ్గురు దుండగులు * డబ్బులు, నగదు ఇవ్వాలని బెదిరింపు * కేకలు వేసిన వ్యాపారి కుటుంబీకులు * స్థానికులు రావడంతో దుండగుల పరారీ * పోలీసులకు కుటుంబీకుల ఫిర్యాదు * విచారణ చేపట్టిన డీఎస్పీ, పోలీసులు * పోలీసుల అదుపులో ఓ వ్యక్తి

శ్రీకాకుళం క్రైం, డిసెంబర్21 (వార్త): శ్రీకాకుళం నగరంలోని కాకివీధిలో ఉంటున్న వ్యాపారి కోరాడ గోవింద్ ఇంట్లోకి శనివారం రాత్రి 7.20 గంటలకు ముగ్గురు వ్యక్తులు ప్రవేశించారు. వారిలో ఇద్దరు ప్రధాన ద్వారం నుంచి, మరో వ్యక్తి వెనుక నుంచి ద్వారం ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటి తలుపులు మూసివేసి కత్తులు తీసి గోవింద్ తల్లి సూర్య కుమారి, భార్య మౌనికలను బెదిరించారు. మెడలో బంగారు ఆభరణాలు దోచుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. వంట గదిలోంచి వచ్చిన గోవింద్ అన్న కొడుకుతో పాటు మౌనిక వారిపై ప్రతిఘటించారు. అలాగే దొంగా దొంగా అంటూ కేకలు వేశారు. దీంతో స్థానికులు ఏం జరిగిందన్న దానిపై వారి ఇంటి వద్దకు వచ్చారు. ముగ్గురు దుండగులు తమతో తెచ్చుకున్న కత్తులను అక్కడే పడేసి పారిపోయారు. స్థానికులు వారిని వెంబడించారు. ఈ ఘటనపై కుటుంబీకులు గోవింద్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటన స్థలానికి చేరుకుని పారిపోవడానికి






ప్రయత్నిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకున్నారు. మరో ఇద్దరు మాత్రం బైక్‌పై పరారయ్యారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ కె.పైడపునాయుడు దొరికిన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద కోరాడ గోవింద్ ఇంటికి చేరుకుని ఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. పరారీలో ఉన్నవారి కోసం వన్‌టౌన్ పోలీసులు, సీసీఎస్ బృందం గాలింపులు చేపడుతున్నారు. గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.పైడపునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డీఎంహెచ్‌వో మీనాక్షి బదిలీ

### నూతన డీఎంహెచ్‌వోగా బాలమురళీకృష్ణ

శ్రీకాకుళం, డిసెంబర్21(వార్త): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మీనాక్షికి బదిలీ అయింది. ఇక్కడికి డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా బడినేహల్ పీహెచ్‌సీ వైద్యులు టీవీ బాలమురళీకృష్ణ (డిప్యూటీ సివిల్ సర్జన్)ను ప్రమోషన్‌పై శ్రీకాకుళం డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని విశాఖ ఆర్‌టీసీ(మేల్) విభాగానికి ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. అలాగే కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డీసీఎస్‌ఆర్‌ఎంవోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.అనిత బదిలీపై శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)కు సీఎస్‌ఆర్‌ఎంవోగా ప్రమోషన్‌పై వస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబు ప్రమోషన్‌పై పలాస కిడ్నీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అండ్ డయాల్సిస్ యూనిట్‌కు సీఎస్‌ఆర్‌ఎంవోగా నియమితులయ్యారు.

## సంక్షేమ పాలన.. జగన్‌తోనే సాధ్యం

* ప్రజలు అత్యాశకు పోయి కూటమిని గెలిపించి మోసపోయారు * రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు * డిప్యూటీ మాజీ సీఎం ధర్మాన కృష్ణదాస్ * జిల్లావ్యాప్తంగా ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

నరసన్నపేట, డిసెంబర్ 21 (వార్త): రాష్ట్రాన్ని సర్వతో ముఖాభివృద్ధి పాటుపడిన దమ్మున్న నాయకుడు ఒక్క వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని డిప్యూటీ మాజీ సీఎం, వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శనివారం నరసన్నపేట వైయస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ చీఫ్ వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. వారి మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని... ఆరు నెలల కాలంలోనే ప్రజలకు కూటమి ప్రభుత్వ దగా పాలన అర్థమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చూసి ప్రజలు అత్యాశకు పోయి గెలిపించారని, తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను పక్కన పెట్టేసిందని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దగాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.






## రైతుకు.. చివరికి కన్నీరే

* గత నాలుగు రోజులుగా వర్షాలు * జిల్లాలో నీటమునిగిన వరిపంట * నేలకొరిగిన వరిపైరు * వరి పనలు కాపాడుకునేందుకు రైతుల నానాపాట్లు * రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

శ్రీకాకుళం, డిసెంబర్21(వార్త): అల్పపీడనం రైతులకు పీడనే మిగిల్చింది. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల వరి పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పంట చేతికి అందివచ్చిన సమయంలో వరుణుడు కన్నీరే మిగిల్చాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి తోడు గాలులు వీయడంతో వరి పంట నేలకొరిగి నీట మునిగింది. కోతకోసిన వరి కంకులు సైతం అక్కడక్కడా మొక్కలు మొలిచాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ రైతులకు పంటను కాపాడుకునేందుకు గాను సూచనలు, సలహాలు ఇస్తున్నారు. మరో పక్క పంట నష్టం అంచనా వేస్తున్నారు.

## రైతులను ఆదుకుంటాం

* రైతుల నుంచి చివరి ధాన్యం గింజ వరకూ కొంటాం * తేమ శాతం 24 నుంచి 14 శాతానికి తగ్గించాం * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, డిసెంబర్ 21(వార్త): రాష్ట్రంలో ఉన్న రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్థక, డెయిరీ అభివృద్ధి, మత్స్య శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. టెక్కలి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డారు. రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. జిల్లాలోని కాలువల ద్వారా గత ప్రభుత్వం హయాంలో ఏనాడైనా పలాసకు నీరు వెళ్లడం రైతులు ఎప్పుడైనా చూశారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే చిట్టచివరి సెంటు వరకు నీరు ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి 1600 వందల కోట్లు ధాన్యం బకాయిలు ఉండగా వాటిని కూటమి ప్రభుత్వం తీర్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ధాన్యాన్ని నిమిషాల్లో కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, 3.28 లక్షల మంది రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. 4,865 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయానకి కూలీలు దొరకడం లేనందు వలన నేటి కాలంలో యాంత్రీకరణ వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం మిషన్లతో ధాన్యాన్ని కోసి ధాన్యాన్ని వేరు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచించి ధాన్యం 24 తేమ శాతను 14 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. కురుస్తున్న వర్షాలకు ధాన్యం పాడైపోయే అవకాశం ఉందన్నారు. చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు రైతులకు ఇస్తామన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ



**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం సాయంత్రం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, పరిసరాలను పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. సిబ్బంది విధులు, వారి పనితీరుపై ఆరా తీశారు. రాత్రి వేళల్లో ముమ్మురంగా గస్తీ నిర్వహించి, నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణా అరికట్టాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

# మాతృ, శిశు మరణాలు సంభవించనివ్వొద్దు

**-జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**



**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** మాతృ మరణాలు సంభవించకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ వైద్యాధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో మాతృ మరణాల నివారణపై ఆయన శనివారం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృ మరణాలు జరగకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్యులు చర్యలు తీసుకోవాలన్నారు. మాతృ మరణాలు లేకుండా దృష్టి సారించాలని, ప్రమాద పరిస్థితిలో ఉన్న వారిని సరైన సమయంలో దగ్గరలోని ఉన్నత ఆసుపత్రికి రిఫర్ చేసి ప్రమాదకర పరిస్థితి నుండి రక్షించాలని సూచించారు. రక్తహీనత తలెత్తకుండా ముందుగానే గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. శిశు మరణాలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సమావేశం లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.బి.మీనాక్షి, డి.సి.హెచ్.ఎస్ డా.కళ్యాణ్‌బాబు, డిపిఎన్‌హెచ్ఎన్ఓ శైలజ, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని శాంతిశ్రీ, వివిధ పి.హెచ్.సి వైద్యాధికా రులు, మాతృ మరణాల కమిటీ సభ్యు లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సాగునీటి ప్రాజెక్టు సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం



**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా జరిగాయి. శనివారం ఉదయం స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో వంశధార ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు ఎన్నికలను పర్యవేక్షించారు. బీఆర్‌ఆర్ వంశధార ప్రాజెక్టుకు చైర్మన్‌గా అరవల రవీంద్రబాబు, వైస్ చైర్మన్ గా ఆనందరావును, టిపిఆర్ నారాయణపురం ఆనకట్ట ప్రాజెక్టు సిస్టంకు చైర్మన్‌గా సనపల ఢిల్లేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా పొన్నాడకు చెందిన పంచిరెడ్డి కృష్ణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. రైతులకు సకాలంలో నీరు అందించేందుకు కమిటీలు కృషి చేయాలని సూచించారు. కాలువల ఆధునికీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, దానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి





**మెళియాపుట్టి, డిసెంబర్ 21(వార్త):** చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని టెక్కలి ఫుల్ అడిషనల్ చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు.

శనివారం ఆయన మెళియా పుట్టి తహసీల్దార్ కార్యాలయంలో మ హిళల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కులు, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, వరకట్న వేధింపులు, లైంగిక దాడు లు, గృహహింస, లైంగిక వేధింపులు, మహిళల అపహరణ, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సదస్సులో జాతీయ మహిళా కమిషన్ రిసోర్స్ సభ్యులు వి.హరిప్రియ, పి.సౌజన్య, తహసీల్దార్ బి.పాపారావు, ఎంపీడీవో నరసింహప్రసాద్ పండా, ఎంఈవో దేవేందర్‌రావు, ఏఎస్ఐ బి.అప్పన్న, వెలుగు ఏపీఎం త్రినాథమ్మ, మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా శశిభూషణ్‌రావు



**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** శ్రీకాకుళం జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోర్డినేటర్‌గా సంపతిరావు శశిభూషణ్‌రావు నియమితులయ్యారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న ఈయన డిప్యూటేషన్‌పై సమగ్ర శిక్షకు బదిలీ అయ్యారు. ఈయన ఆ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు.

# సకాలంలో ధాన్యం కొనుగోలు చేయండి




**మందస, డిసెంబర్ 21(వార్త):** సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కోరారు. మందస మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పడుతున్న ఇబ్బందులను రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్షాలతో ధాన్యం తడిచి పోతున్నాయన్నారు. సకాలంలో ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బర్త్ సర్టిఫికెట్లను విద్యార్థులకు సకాలంలో అందించక తహసీల్దార్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం మండల బడ్జెట్‌పై చర్చించారు. సవరణ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఎంపీడీవో పైల సూర్యనారాయణ, మండల పంచాయతీ విస్తరణాధికారి కె.జయప్రకాశ్, ఏవో బూరగాన రుషేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పంట నష్టాన్ని రైతులు నివారించాలి

**మెళియాపుట్టి, డిసెంబర్ 21(వార్త):** రైతులు జాగ్రత్తలు తీసుకొని పంట నష్టాన్ని నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి దానకర్ణుడు అన్నారు. శనివారం ఆయన జగన్నాథపురం తదితర గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కోత కోసిన పంట వర్షానికి తడిస్తే.. గింజ మొలకెత్తకుండా ఐదు శాతం లీటర్ నీటిలో 50 గ్రాములు కళ్లు ఉప్పు కలిపి, పనలు పైన పిచికారి చేయాలని సూచించారు. మినుము, పెసర, వేరుశనగ పొలాల్లో నీరు నిల్వ ఉంటే, ఆ నీటిని మళ్లించాలన్నారు. ఆయన వెంట వీఆర్వోలు, వీఏఏలు, రైతులు తదితరులు ఉన్నారు.

## అకాల వర్షం..అపార నష్టం!



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 21(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని అకాల వర్షాలకు రైతులకు అపార నష్టం వాటిల్లింది. శనివారం ఉదయం నాటికి ఇచ్ఛాపురంలో 8.7 ఎంఎం, కంచిలిలో 19.4 ఎంఎం, కవిటిలో 18.5 ఎంఎం, సోంపేటలో 11.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. వ్యవసాయ శాఖ ఏడీ జగన్మోహన్‌రావు, వ్యవసాయ అధికారి భార్గవి బూర్జపాడు, బేల్లుపడా, ధర్మపురంల్లో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు.

## ఉత్సాహంగా భగవద్గీత శ్లోకాల పోటీలు



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 21(వార్త):** ఇచ్ఛాపురంలోని రోటరీ క్లబ్‌లో శనివారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోకాల పోటీలు ఉత్సహంగా జరిగాయి. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంఈవో కురుమాన అప్పారావు, రామ్‌ప్రసాద్ మాస్టారు, జ్ఞానభారతి జోహార్ ఖాన్ తదితరులు విచ్చేశారు. జూనియర్ విభాగంలో బచ్చు కావ్య, ఉప్పాడ కుసుమ( మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, పంజా వీధి), సదాశివుని నివాస్ (రవీంద్రభారతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. సీనియర్ విభాగంలో జి.అరుణ (కేజీబీవీ), కె.బేబీరాజు(సత్యసాయి), జి.రమ్య (కేజీబీవీ) ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో పాక దాసు, ఆర్.జయ కృష్ణ, కామరాజు, ఆసి మోహన్, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 21(వార్త):** లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు డా.ఎం.కె. మిశ్రో అధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు ధ్యాన సాధన చేశారు. ఈసందర్భంగా మిశ్రో మాట్లాడుతూ ధ్యాన సాధనతో వ్యక్తిత్వ వికాసం, మనశ్శాంతి సమకూరడంతో పాటు మానసిక ఒత్తిడికి గురవ్వకుండా ఉంటామన్నారు. ఏకాగ్రత కూడా పెరిగి కోపం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పలాస జీఎస్టీ అధికారిగా చౌదరి పురుషోత్తనాయుడు

**పలాస, డిసెంబర్ 21(వార్త):** పలాస సర్కిల్ జీఎస్టీ అధికారిగా ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా ఉద్యోగిగా చేరి జీఎస్టీవో గా పదోన్నతి పొంది మళ్లీ ఇక్కడ చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, బడియ కామరాజు, రాయి వేణుగోపాల్, టి.పరమేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, కేశవ రావు, బోనెల గోపాల్, బొంతల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.





## 29న తూర్పు కాపుల ఆత్మీయ సదస్సు

**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** తూర్పు కాపు జిల్లా మహా సమ్మేళనం ఈ నెల 29న ఎచ్చెర్ల కేశవరెడ్డి స్కూల్ పక్కన నిర్వహిస్తున్నామని ఆ సామాజిక సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం వారు ఈ కార్యక్రమ ఆహ్వాన పత్రాలను ఆ సంఘ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్, శాసపు జోగినాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని తూర్పు కాపు బిడ్డలంతా ఈ ఆత్మీయ సమ్మేళనానికి తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు ఇజ్జాడ శ్రీనివాసరావు, లంక శ్యామసుందర్, కిల్లారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామ జోగినాయుడు, వాళ్ల శ్రీరాములునాయుడు, పల్లి సురేష్, డోల బాలు, డాక్టర్ చందక రామకృష్ణ, అప్పారావు, ఆబోతుల రామకృష్ణ ఎం.శంకర్ నారా యణ తదితరులు పాల్గొన్నారు.

## తోటపల్లి ప్రాజెక్ట్ చైర్మన్‌గా విజయరమణి



**వంగర, డిసెంబర్ 21(వార్త):** తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్‌గా పొదిలాపు విజయ రమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వీరఘట్టం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి డ్వామా పీడీ కె.చంద్రరావు ఆధ్వర్యంలో తోటపల్లి ప్రాజెక్టు ఎన్నిక జరిగింది. పొదిలాపు రమణి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. వైస్ చైర్మన్‌గా ఆలుబిల్లి పార్థసారథి(కిషోర్)ని ఏక గ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో తోటపల్లి ప్రాజెక్టు అధికారులు, ఐదు మండలాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## తూనికలు, కొలతలపై అవగాహన



**హిరమండలం, డిసెంబర్ 21(వార్త):** తూనికలు, కొలతలపై హిరమండలంలోని కేజీబీవీ విద్యార్థినులకు జిల్లా తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ విశ్వేశ్వరరావు శనివారం అవగాహన కల్పించారు. ఆ పాఠశాలలో వినియోగదారుల సంఘం జిల్లా సెక్రటరీ అంధవరం వెంకట్ సురేష్ ఆధ్వర్యంలో వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వస్తువుల కొనుగోలులో అప్రమత్తం గా ఉండాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్ మాట్లాడుతూ కొనుగోలు సమయంలో బిల్లు తీసుకోవాలన్నారు. వెంకట్‌సురేష్ మాట్లాడు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం ఉండాలని పిలుపునిచ్చారు. ఒకవేళ మోసపోతే వినియోగదారుల ఫోరంను సంప్రదించాలని సూచించారు కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయినిలు, సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్ భార్గవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శబరిమలలో సిక్కోలు స్వాముల అభిషేకాలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** లోక కల్యాణార్థం శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానంలో స్వామివారికి అభిషేకాలు శనివారం నిర్వహించామని సేవకులు ఉర్లాం శివతేజ తెలిపారు. శ్రీకాకుళంలోని మండలవీధికి చెందిన ప్రసాద్ గురుస్వామి సన్నిధానం నుంచి వీరు శబరిమలకు చేరుకొని స్వామి వారికి పుష్పాభిషేకం, అష్టాభిషేకాలు నిర్వహించారు. ఈ పూజల్లో డా.చౌదరి రాజేష్, నల్లపిల్లి భానుప్రసాద్, పి.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- ఎమ్మెల్యే గొండు శంకర్**

**- ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం**



**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** ధ్యానంతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానంతోనే మానసిక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ చిన్న ప్పట్నుంచే యోగాభ్యాసాన్ని అలవాటుగా మార్చుకొని నిరంతర సాధన చేయాలని సూచించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ అమ్మన్నాయుడు, అపెక్స్ సభ్యురాలు గీతా శ్రీకాంత్ ధ్యానం ప్రతీ ఒక్కరికీ అవసరమని తెలిపారు. ప్రపంచ శాంతి, సమగ్రత పెంపొందించడంలో ధ్యానం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఇంటాక్ కోకన్వీనర్ జగన్నాథంనాయుడు, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణ రావు, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, యోగా టీచర్లు టి.సుధారాణి, కె.రేణుక, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సలహాదారు శాసపు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

**-జీవో నెంబర్ 77 రద్దు చేయాలి**

**-ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం**




**శ్రీకాకుళం, డిసెంబర్ 21(వార్త):** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3580కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఆ సంఘం నాయకులు శనివారం నిరసన వ్యకతం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నెలలు గడుస్తున్నా బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తోందని ఆరోపించారు. దీంతో ఫీజులు కట్టాలని విద్యార్థులను విద్యాసంస్థల యాజమాన్యాలు ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉండిపోవడంతో ఉన్నత విద్య అభ్యసించలేని పరిస్థితులు వారు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్‌కుమార్, శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మందస, డిసెంబర్ 21(వార్త):** మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గణిత క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. గణిత ఉపాధ్యాయుడు గవ్వ భీమారావును ఘనంగా సత్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ గణితంలో శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు, గణితం గొప్పతనాన్ని వివరించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, ఎస్.హారిక, విద్యార్థులు పాల్గొన్నారు.



# దేశాభివృద్ధికి గణితమే దిక్సూచి

**▪ పాఠశాలల్లో ఘనంగా గణిత దినోత్సవం ▪ విద్యార్థులకు క్విజ్ పోటీల నిర్వహణ**



**పోలాకి, డిసెంబర్ 21(వార్త):** ఆర్థికాభివృద్ధికి దేశ ప్రగతికి గణిత శాస్త్రమే దిక్సూచి అని గణిత శాస్త్ర నిపుణులు గౌరీశంకర్, శివప్రసాద్ అన్నారు. శనివారం వారు ప్రియాగ్రహారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవంలో మాట్లాడారు. శ్రీనివాసరామానుజన్ గణితంలో తీసుకున్న చొరవ అద్భుతం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపి, రామకృష్ణ, రామారావు, మోహనరావు, నరసింహమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 21(వార్త):** గణిత మేధావి రామానుజన్ అని కొలిగాం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. శనివారం ఆ పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు జ్యోతి, రేణుకా గౌడో, చంద్రవదనను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పద్మావతి, నిలిప్, అమిత్, మిను, స్వప్న, పూండి, పీతాంబర్, దేవకి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## జ్ఞానభారతిలో ధ్యాన దినోత్సవం

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 21(వార్త):** మానసిక ప్రశాంతతకు, అద్భుతమైన జీవన విధానానికి ధ్యానం ఎంతో ఉపయుక్తమని జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సీఈవో, కార్యదర్శి జోహార్‌ఖాన్ అన్నారు. శనివారం ఆ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# వాడవాడలా జగన్ జన్మదిన వేడుకలు

**పలాస, డిసెంబర్ 21(వార్త):** భవిష్యత్‌లో మనదేనని, కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు పలాసలోని ప్రగతి భవనంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హయాంలో అన్నివర్గాల వారు సంతోషంగా జీవించారన్నారు. ఈ ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు, నిత్యావసరాలు, గ్యాస్ ధరలు ఆరు నెలలు తిరగకుండానే పెంచిందని, ఇది పేద ప్రజలను ముంచే ప్రభుత్వం అని మండిపడ్డారు. వీటిపై ప్రజలను చైతన్యపరచాలని ఆయన కార్యకర్తలకు సూచించారు.



కార్యక్రమంలో వైసీపీ నేతలు పైల వెంకటరమణ (చిట్టి), ఉంగ సాయికృష్ణ, పైలా శ్రీనివాస రావు, దువ్వాడ మధుకేశ్వరరావు, బోరా బుజ్జి, దానయ్య, పెద్ద ఎత్తున వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

**మెళియాపుట్టి, డిసెంబర్ 21 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో మెళియాపుట్టిలోని వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





**మందస, డిసెంబర్ 21(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మందస మండలంలో పలు చోట్ల ఘనంగా జరిగాయి. భేతాళపురంలో గ్రామ దేవతలు అసిరిపోలమ్మతల్లి, శ్రీపాతలేశ్వర స్వామికి పూజలు జరిపారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్, వార్డ్ మెంబర్ సంగారు కృష్ణారావు, సీనియర్ నాయకులు తాడాల అప్పలస్వామి, బైపల్లి జోగారావు, కీలు మోహన్ రావు, రెయ్యి సింహాచలం, జుత్తు పాపారావు, మడియా రుషి, జుత్తు నారాయణ, బత్తిని మాధవ రావు, గుంటు కపిల్, దున్న గంగా రావు, అంబటి మోహన్, గుంటు రామస్వామి తదితరులు పాల్గొన్నారు. టంగరాపుట్టి పంచాయతీలో జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవర డొంబు రు, సర్పంచ్ సవర నవిత ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సవర వసంతరావు, హడ్డి, లక్ష్మయ్య, నారాయణ, ప్రసాద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 21(వార్త):** మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో కంచిలి సీతయ్య ఫౌండేషన్‌లోని అనాథలు, వృద్ధులు, వికలాంగులు ఒకరోజు భోజనం అందించారు. వృద్ధులు, బాలల సమక్షంలో కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకుడు జి.రమేష్, నర్తు నరేంద్రయాదవ్, ఇచ్ఛాపురం వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, వైకాపా ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్ల దేవరాజు, దట్టి అజయ్, బాకి లక్ష్మీనారాయణ, జుత్తు కామేశ్వంరావు, కొరికాన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





**ఎల్ఎన్ పేట, డిసెంబర్ 21(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఎల్ఎన్ పేట జంక్షన్‌లో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేసి, పలువురికి స్వీట్స్, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కిలారి వెంకటరమణ, ముద్దాడ రఘుపతి, కళ్యాణ దాలెప్పడు, పొట్నూరు అప్పన్న, కాగితాపల్లి అర్జునరావు, బి.లక్ష్మణరావు, పైల తవిటినాయుడు, కంచరాపు సింహాచలం, కోటిపల్లి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 21(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్ ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. పేదలు, రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాస్టర్ బిమో బెహరా, ఏలీయా, పీసా దాసు, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈదుపురంలో వైసీపీ నేత నర్తు నరేంద్రయాదవ్ కేక్ కట్ చేశారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు ప్రసాద్‌రావు, ఎంపీటీసీ ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, ఉపసర్పంచ్ మురా బెహరా, ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షుడు రామచంద్ర బెహరా, మోహన్ బెహరా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దుక్క నీలాద్రి రెడ్డి, భీమ్మో బెహరా, బోనమాలి బెహరా, హంగీర్ బెహరా పాల్గొన్నారు.





**టెక్కలి, డిసెంబర్ 21 (వార్త):** వైస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు టెక్కలిలో శనివారం ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. భారీగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెక్కలి బీసీ హాస్టల్ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు.

కార్యక్రమంలో టెక్కలి నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక




## ఘనంగా జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**సంతకవిటి, డిసెంబర్ 21 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శ్రీకాకుళం జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు, ఎంపీపీ సిరిపురపు మంజుల ఆధ్వర్యంలో మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంతా నూతనోత్సాహంతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు కోరారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల జ్యోతీశ్వరరావు, రాగోలు రమేష్ నాయుడు, వావిలపల్లి శ్రీనివాస నాయుడు, వావిలపల్లి రమణ, డోల తిరపతిరావు, కనకల సన్యాసి నాయుడు, బీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల్లో జవాబుదారీతనం పెరగాలి
### సాధారణ సర్వ సభ్య సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్

**సంతకవిటి, డిసెంబర్ 21 (వార్త):** అధికారులు ప్రజలకు జవాబు దారులగా సేవలందించాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మంజు, ఎంపీడీవో కే సురేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా అధికారులు ప్రజా పక్షాన జవాబు దారీ తనంతో మెలగాలన్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన అధికార పార్టీ నేతలకు అధికారులు కొమ్ముకాయడం, సహచర ఉద్యోగులపై నేర నిరూపణ, సమగ్ర విచారణలు లేకుండా విధుల నుండి తొలగించడం వంటివి సహేతుకమైన చర్యలు కాదన్నారు. గోళ్ల వలస ఫీల్డ్ అసిస్టెంట్, అక్కరాపల్లి గ్రామానికి చెందిన వెలుగు సిబ్బంది వంటి కింది స్థాయి ఉద్యోగులపై చర్యలు సరికాదంటూ ఆయా శాఖాధికారుల పనితీరు పై మండిపడ్డారు. అనంతరం మండల అభివృద్ధి, నిర్వహణ కార్యక్రమాల పై వాడీవేడిగా చర్చించారు. పలు తీర్మానాలపై మండల పరిషత్ సభ్యులతో చర్చించి పలు బిల్లులను ఆమోదించారు. 2024-25 సవరణ బడ్జెట్లతో పాటు 2025-26 సంవత్సర అంచనా బడ్జెట్‌ను నివేదించారు.

**బదిలీ పై వెళ్లిన మండల పరిషత్ అధికారులకు సన్మానం**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సేవలందించి బదిలీపై వెళ్లిన అధికారులు, సిబ్బందిని శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు, ఎంపీపీ సిరిపురపు మంజూ, ఎంపీడీవో కే సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈవోపీర్డీ ఎల్ పుష్పలత గరివిడి, సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన ఏ ముత్యంజయరావు లావేరు మండలానికి, ఏస్‌వో వి క్రిష్ణవేణి, రాజాం మండలాలకు బదిలీ అయ్యారు. వారికి సన్మానించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వైస్ యంపీపి, యంపీటీసి సభ్యులు బత్తుల జ్యోతీశ్వరరావు, కనకల సన్యాసి నాయుడు, వావిలపల్లి శ్రీనివాస నాయుడు, వి. రమణ, ఆర్ రమేష్, డోల తిరపతిరావు, జీ. కే సురేష్, షణ్ముఖరావు, అధికారులు, ఏవో రఘునాథ ఆచార్యులు, మండల పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

## ధ్యానంతో ఒత్తిడి నుంచి విముక్తి

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 21 (వార్త):** ధ్యానంతో ఒత్తిడి నుంచి విముక్తి కలుగుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీల ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక చినమండలవీధిలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నేషనల్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఏపీ ఉపాధ్యక్షులు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, గొండ్యాల అర్చన, స్వాతి, బగాది వాసుదేవరావు, జ్యోతి, రాంబాబు, భాగ్యలక్ష్మి, సత్యనారాయణ, సవరయ్య పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

**వంగర, డిసెంబరు 21 (వార్త):** భూసంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందని డిప్యూటీ తహశీల్దారు హరి రమణారావు వెల్లడించారు. శనివారం వీవీ ఆర్ పేట, జెకె గుమ్మడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి భూసమస్యలపై వినతులు స్వీకరించారు. సభలో వచ్చిన అర్జీ లను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో సాయిబాబా, సచివాలయ సర్వేయరు, సర్పంచ్ మరిశర్ల గంగారావు, సచివాలయం సిబ్బంది, స్థానిక రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా నేషనల్ కన్స్యూమర్స్ డే


**పలాస, డిసెంబర్ 21 (వార్త):** నేషనల్ కన్స్యూమర్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకట లక్ష్మి అధ్యక్షతన వినియోగదారుల చైతన్య సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పలాస తాసిల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి పాల్గొని వినియోగదారుల చట్టంపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘాల సమైక్య అధ్యక్షులు డి.ఉమామహేశ్వరరావు, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఏబీసీ కోఆర్డినేటర్ ఎన్ శ్రీనివాస్ పట్నాయక్, ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ అధినేత ఎల్.గణపతి రావు, లైబ్రేరియన్ బి నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీడీపీ నేత నాగరాజు హత్యకు..
# పక్కా ప్లాన్

* ఈ కేసులో మొత్తం 17 మంది పాత్ర
* ఏడుగురి అరెస్టు
* పరారీలో మరో పదిమంది
* రెండు పిస్టళ్లు, ఒక తపంచా, 40 బుల్లెట్లు, మూడు బైక్‌లు, ఒక కారు స్వాధీనం
* వివరాలు వెల్లడించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* కేసు ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంస



**పలాస, డిసెంబర్ 21 (వార్త):** టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజును హత్య చేసేందుకు చిన్నబడాంకు చెందిన కూర్మాపు ధర్మారావు, అనుచరులతో కలిసి కుట్రపన్నారని, పోలీసులు ఆ కుట్రను ఛేదించారని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేశామని, మరో పదిమందిని అదుపులోకి తీసుకోవాల్సివుందన్నారు. వీరిలో ముగ్గురు బిహార్‌కు చెందిన వారు ఉన్నారని చెప్పారు. శనివారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ మీడియాతో మాట్లాడారు. చిన్నబడాంకు చెందిన బడ్డ నాగరాజు రాజకీయపరంగా, బిజినెస్‌పరంగా తమను చాలా ఇబ్బందులు గురిచేస్తున్నాడని, అతడిని ఎలాగైనా హత్య చేయాలని అదే గ్రామానికి చెందిన కూర్మాపు ధర్మారావుతో పాటు మరికొందరు నిర్ణయించుకున్నారు. బిహార్ నుంచి ఓ గ్యాంగ్ ద్వారా నాగరాజును చంపాలని ప్రణాళిక రూపొందించారు. తలో లక్ష రూపాయలు వేసుకోవాలని నిర్ణయించుకున్నారు. హనుమంతు బాబూరావుకు పరిచయం ఉన్న బిహార్ గ్యాంగ్‌కు చెందిన అలోక్ అనే వ్యక్తి ద్వారా ఇతర సభ్యులు ఇక్బాల్, చోటు, అమీర్, నిరంజన్ పాశ్వాన్‌లతో పది లక్షలకు కిరాయికి కుదుర్చుకున్నారు. గతనెల 10వ తేదీన వారిని విశాఖపట్నం రప్పించారు. 30వ తేదీ వరకూ శ్రీకాకుళం జిల్లాలోనే వారు ఉన్నారు. అదేరోజు కాశీబుగ్గలో వారికి రెండు లక్షలు అడ్వాన్సును కూర్మాపు ధర్మారావు, అంపోలు శ్రీనివాసరావులు ఇచ్చారు. ఆ తర్వాత నుంచి బిహార్ బ్యాచ్ నాగరాజు కదలికలపై రెక్కీ నిర్వహించారు. ఈనెల 10వ తేదీన ఇక్బాల్, అమీర్, నిరంజన్ సాహులు పలాస వచ్చి రైతు చంద్రశేఖర్ రూములో కోసంగిపురం వద్ద ఉన్నారు. ముందు చేసుకున్న ఒప్పందం మేరకు మరో రెండున్నర లక్షల రూపాయలను పొన్నాడ కృష్ణారావు అందజేయగా, ఆ నగదుతో రెండు పిస్టల్స్, ఒక తపంచా, 45 రౌండ్ల బుల్లెట్లు, రెండు ఫేక్ నంబరు ప్లేట్లతో ఉన్న మోటారు సైకిళ్లు, ఒక అద్దెకు తీసుకున్న మోటారు సైకిల్‌ను కొనుగోలు చేశారు. ఈనెల 13న బిహార్ బ్యాచ్ చిన్నబడాం, కాశీబుగ్గ మధ్యలో నాగరాజు మర్డర్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తిరిగి ఈనెల 20న అంపోలు శ్రీనివాసరావు, ఇక్బాల్ ఒక బైకుపైన, రౌతు చంద్రశేఖర్, అమీర్‌లు మరో బైక్‌పై బడ్డ నాగరాజును చంపడానికి వెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. అలాగే కోసంగిపురం జంక్షన్ వద్ద మిగతా ముగ్గురు సభ్యులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఎస్పీ తెలిపారు. చిన్నబడాం గ్రామానికి చెందిన అంపోలు శ్రీనివాసరావును, కూర్మాపు ధర్మారావు, కోట శ్రీనివాసరావు, మందస మండలం జిల్లుండకు చెందిన రౌతు చంద్రశేఖర్‌లతో పాటు బిహార్‌కు చెందిన ఎండీ ఇక్బాల్ రాజఖాన్, ఎండీ అమిర్, నిరంజన్ కుమార్ పాశ్వాన్ అరెస్టు చేశామని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కుట్రలో భాగమైన హనుమంతు బాబూరావు, పొన్నాడ కృష్ణారావు, కూర్మాపు సుందరరావు, డిక్కల నిరంజన్, దువ్వాడ రమణారావు, అట్టాడ ప్రసన్న కుమార్, సనపల కిరణ్ కుమార్, అలోక్, ఫిరోజ్‌ఖాన్, విజయ్‌లను అదుపులోకి తీసుకోవాల్సివుందన్నారు.






### పోలీసులకు ప్రశంస..

కాశీబుగ్గ డీఎస్పీ ఎం.అప్పారావు, టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ మూర్తి పర్యవేక్షణలో క్రియాశీలకంగా వ్యవహరించి ముద్దాయిలను పట్టుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు. మీడియా సమావేశంలో సీఐలు టి.సూర్యనారాయణ, తిరుపతిరావు, డి.మోహనరావు, ఎస్ఐలు కూడా ఉన్నారు.

## దువ్వాడ స్వగృహంలో జగనన్న జన్మదిన వేడుకలు

**టెక్కలి, డిసెంబర్ 21(వార్త):** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ స్వగృహంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు దివ్వల మాధురీతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ పేద ప్రజల బాంధవుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందేవన్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజలంతా జగన్మోహన్ రెడ్డితోనే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్యకర్తల అభిమానులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546